క్లుప్తంగా

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

మదనపల్లె: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని బెంగుళూరు రోడ్డులో ఇసుక రవాణాకు సంబంధించి ఎటువంటి అనుమతులు, పర్మిట్ లేకుండా ట్రాక్టర్లలో ఇసుక రవాణా చేస్తున్నట్లు సమాచారం అందడంతో తాలూకా పోలీసులు దాడులు చేశారు. ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులపై కేసు నమోదు చేస్తామని చెప్పారు.

20 లీటర్ల సారా స్వాధీనం

మదనపల్లె: అక్రమంగా నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. మదనపల్లె సెబ్ స్టేషన్ పరిధిలో నాటుసారా తయారీ, అమ్మకాల నివారణలో భాగంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని అందులో భాగంగా మంగళవారం మున్సిపాలిటీలోని నక్కలదిన్నె తాండాల్లో దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఈ దాడుల్లో మూడే తిరుపాల్‌నాయక్ (40),మూడే రాందాస్‌నాయక్ (55) సారా విక్రయిస్తుండగా అరెస్టు చేశామన్నారు.

బీటీ కళాశాల పీడీ ఆకస్మిక మృతి

మదనపల్లె: బీటీ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ నారాయణస్వామి ఆకస్మికంగా మృతి చెందాడు. ఆదివారం రాత్రి విజయవాడ సీసీ ఆఫీసుకు బయలుదేరిన నారాయణస్వామి తిరుపతి బస్టాండులో బస్సు కోసం ఎదురు చూస్తుండగా ఆకస్మికంగా కార్డియాక్ అరెస్ట్ (గుండెపోటు) గురై తీవ్ర అస్వస్థతకు లోను అయ్యాడు. ఆస్పత్రికి చేర్పించేలోగా మృతి చెందాడు. ఆయన మృతికి సంతాపంగా మంగళవారం బీటీ కాలేజీలో అధ్యాపక,ఉద్యోగులు శ్రద్ధాంజలి ఘటించారు.

పట్టు రైతులకు శిక్షణ

బి.కొత్తకోట: మండలంలోని గోళ్లపల్లె రైతు భరోసా కేంద్రంలో మంగళవారం పట్టు రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పట్టు అధికారి రసూల్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు కల్పిస్తున్న రాయితీ పథకాలు, మల్బరీతోటల్లో షెడ్ల నిర్మాణం, ఇతరా కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచులు పుష్పలత, ఉజ్జయిని సాంబశివ, ఎంపీటీసీ విమలమ్మ ఆనందరెడ్డి, పంచాయతీ పంచాయతీ కార్యదర్శి మూర్తి, ఆర్‌బీకే చైర్మన్ సిద్దారెడ్డి, టీఏ రమణ, రైతులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పరీక్షలు

తంబళ్లపల్లె: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఫార్మెటీవ్ అసెస్మెంట్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మంగళవారం ఎంఈవోలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు తెలిపారు. విద్యార్థుల అభ్యసన, మదింపు సామర్థ్యాలను అంచనా వేసేందుకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫార్మెటీవ్, సమ్మేటీవ్ పరీక్షలను ప్రభుత్వం ప్రయోగాత్మకంగా క్లాస్‌రూమ్ బేస్డ్‌తో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.1–8వ తరగతి వరకు 2528 మంది విద్యార్థులు, 9–10వ తరగతి నుండి 740 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

మానవ అక్రమ రవాణా నివారణపై అవగాహన

తంబళ్లపల్లె: స్థానిక గిరిజన బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో మంగళవారం మదనపల్లె హెల్పింగ్‌మైండ్స్ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్ సిద్దిక్ మాట్లాడుతూ చిన్నారులను, మహిళలను కొందరు అక్రమ రవాణా చేసి బానిసలుగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ రవాణాకు గురైన వారి జీవితాలు బానిసత్వంలో మగ్గుతున్నాయన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తున్నా, అపరిచితుల గురించి వెంటనే 1098కు సమాచారం అందించాలన్నారు. టీచర్లు శ్రీనివాసులు, సౌజన్య, షియావుద్దీన్, జనార్ధన్, హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు సిరాజ్, నాగేంద్ర, పురుషోత్తం పాల్గొన్నారు.

వెంకట్రమణ సేవలు అభినందనీయం

వాల్మీకిపురం: సప్తగిరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ స్కేల్ 2గా పని చేస్తున్న వెంకట్రమణ సేవలు అభినందనీయమని బ్యాంక్ మేనేజర్ సందీప్ కుమార్ రెడ్డి అన్నారు. వెంకట్రమణ పదవీ విరమణ సందర్భంగా మంగళవారం బ్యాంక్ ఆవరణంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రమణ దంపతులను బ్యాంకు సిబ్బంది శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సత్కరించారు. అనంతరం బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ 1985లో విధుల్లో చేరిన వెంకట్రమణ వివిధ హోదాల్లో పని చేసి నిజాయితీగా విధులు నిర్వహించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో చింతపర్తి, ముదివేడు, తరిగొండ, నిమ్మనపల్లి సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్లు, బ్యాంక్ సిబ్బంది, నాయకులు చింతల ఆనంద రెడ్డి, ఉపసర్పంచ్ కేశవ రెడ్డి, ఆర్‌బీకే చైర్మెన్ నీళ్లభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు పక్కాగా నిర్వహించాలి

నిమ్మనపల్లె : రెవెన్యూ రికార్డులు పక్కాగా నిర్వహించాలని మదనపల్లె ఆర్డీఓ ఎం.ఎస్.మురళి స్థానిక రెవెన్యూ అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన నిమ్మనపల్లెలో ఎం.డి. అంజాద్, ఎం.డి.అల్లాబక్షు, ఎం.డి.అజ్‌గర్‌ఆలీలకు సంబంధించిన సర్వే నెంబరు 1075, 1077, 1078, 1088లోని 1.80 ఎకరాల ఉమ్మడి వ్యవసాయ భూమిని ల్యాండ్ కన్వర్షన్ చేయడానికి దరఖాస్తు చేసుకోగా, సంబంధిత భూములను పరిశీలించారు.

సర్కారు బడుల్లో ఇ'స్మార్ట్' బోధన

- బోధనలో సరికొత్త విధానానికి శ్రీకారం
- ఐఎఫ్‌పీలు, స్మార్ట్ టీవీల ద్వారా పాఠాలు
- ఆసక్తిగా వింటున్న విద్యార్థులు



స్మార్ట్ టీవీ బోధనను వివరిస్తున్న టీచర్ లక్ష్మీనారాయణ

పెద్దతిప్పసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్కూళ్ల కంటే సకల సౌకర్యాలతో సుందరంగా రూపు దిద్దుకున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చాక్‌పీసుల కాలం చెల్లుతోంది. తాజాగా బ్లాక్ బోర్డులు, చాక్‌పీసులు లేని డిజిటల్ బోధన అందుబాటులోకి వచ్చింది. పాఠశాలల్లో సమకూర్చిన వసతులు, నూతన విద్యా విధానాలు విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెంచేలా చేస్తున్నాయి. గతంలో అరకొర వసతుల నడుమ విద్యార్థులు చదువుకోగా ఇప్పుడు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించింది. దీనికి తోడు అత్యాధునిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చారు. చదువుపై విద్యార్థులకు రోజు రోజుకు ఆసక్తి పెరగడంతో పాటు సులభతరంగా పాఠాలు అర్థమవుతున్నాయని పేర్కొంటున్నారు. ఇందులో భాగంగా తొలి విడతగా మన బడి–నాడు–నేడు పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్‌ను సమకూర్చింది. 1–5 తరగతులకు స్మార్ట్ టీవీలు, 6–10 తరగతులకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ డిస్‌ప్లేలు ఏర్పాటు చేస్తున్నారు. మిగిలిన పాఠశాలల్లో కూడా ఈ విధానం అందుబాటులోకి వస్తుందని ఎంఈఓ నారాయణ పేర్కొన్నారు. స్మార్ట్ టీవీ విద్యా బోధనా విధానం రాష్ట్ర స్థాయి విద్యా డైరెక్టరేట్ కార్యాలయానికి అనుసంధాన ప్రక్రియ కూడా జరిగింది. డిజిటల్ విద్యా బోధన ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్నారా, లేదా అనే విషయం ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు స్పష్టమైన సమాచారం సులువుగా తెలుస్తుంది.

డిజిటల్ బోధన

అభివృద్ధి చెందిన దేశాలు, పెద్ద పెద్ద సిటీల్లో ఉండే కార్పొరేట్ స్కూళ్లలో మాత్రమే డిజిటల్ బోధన సాగుతోంది. ప్రస్తుతం ఈ విధానాన్ని ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారు. ఈ విధానం ద్వారా ఎంత క్లిష్టమైన పాఠ్యాంశాలు అయినా సులువుగా బోధించవచ్చు. ఈ విధానంతో విద్యార్థులకు సులభంగా పాఠాలు అర్థమవుతున్నాయని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

పాఠాలు సులభంగా అర్థమవుతాయి



టీవీ ద్వారా పాఠాలు వినడం కొత్తగా ఉన్నా కూడా డిజిటల్ బోధన ద్వారా చెప్పే పాఠాలు సులభంగా అర్థమవుతున్నాయి. వీడియోలు, కదిలే బొమ్మల ద్వారా పాఠాలు బోధిస్తుండటంతో కొత్త అంశాలు నేర్చుకోవాలనే ఉత్సాహం పెరిగింది.

-ఎస్.వసియా అంజూమ్, 8వ తరగతి

ఏకాగ్రతతో వింటున్నారు



పిల్లలకు అర్థమయ్యేలా సులభ రీతిలో డిజిటల్ తరహాలో ఫైబర్ నెట్ ద్వారా ప్రత్యక్ష విద్యా బోధన జరగడంతో పిల్లలు ఏకాగ్రతతో వింటున్నారు. డిజిటల్ విద్యా బోధన ఫలితాలు భవిష్యత్తులో ఇంకా బాగుంటాయి. ప్రభుత్వం పాఠశాలల్లో అన్ని రకాల వసతులు కలిస్తోంది.

-అపర్ణాదేవి, హెచ్‌ఎం, తెలుగు హైస్కూల్

ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ



స్మార్ట్ టీవీ, ఐఎఫ్‌పీ విద్యా బోధనలపై మండలంలోని ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. మొదటి విడతగా మండలంలోని 16 స్కూళ్ళలో చదువుతున్న 789 మంది విద్యార్థుల సౌకర్యార్థం స్మార్ట్ టీవీ విద్యా బోధన సాగుతోంది.

-నారాయణ, ఎంఈఓ, పెద్దతిప్పసముద్రం

సబ్‌స్టేషన్లు మంజూరు చేయాలని మంత్రికి వినతి



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సమస్యలు వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథరెడ్డి

పీలేరు : పీలేరు, కెవిపల్లె మండలాలలో విద్యుత్ లోఓల్టేజీ సమస్యల అధికంగా ఉంది. గృహ అవసరాలకు, రైతులకు విద్యుత్ సరఫరాలో అనేక మార్లు అంతరాయం ఏర్పడుతోందని, నాలుగు నూతన విద్యుత్ సబ్ స్టేషన్లు మంజూరు చేయాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని పీలేరు మాజీ ఎమ్మెల్యే జివి శ్రీనాథరెడ్డి కోరారు. మంగళవారం తిరుపతిలోని కార్యాలయంలో మంత్రిని కలిసి పీలేరు, కెవి పల్లె మండలాలలోని విద్యుత్ సమస్యలను తెలియజేశారు. పీలేరులో 18500 విద్యుత్ సర్వీసులు ఉండగా, పీలేరు రూరల్‌లో 3500 సర్వీసులు ఉన్నాయన్నారు. 200 వరకు విద్యుత్ స్తంభాలు మరమ్మతులకు గురై దెబ్బ తిన్నాయని తెలిపారు. అలాగే పీలేరు పంచాయతీలో పచ్చదనాన్ని పెంచడానికి మరో 5000 మొక్కలు అవసరమని కోరారు. సమస్యలపై స్పందించిన మంత్రి మంజూరుకు హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, ఎంవి చలపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

– ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



జగనన్న శాశ్వత భూ హక్కు పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే చింతల

వాల్మీకిపురం: ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చింతలవారిపల్లి పంచాయతీ జమ్మన్లపల్లిలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ దీర్ఘకాలంగానే పరిష్కారం కాని భూ సమస్యలను జగనన్న ప్రభుత్వం పరిష్కరించిందన్నారు. అన్నమయ్య జిల్లాలో మొదటి సారిగా పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని భూ శాశ్వత హక్కును కల్పించడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలు మండల కేంద్రానికి రాకుండా గ్రామ సచివాలయాల ద్వారానే పరిష్కారం అవుతున్నాయన్నారు. ప్రభుత్వ మొట్టమొదటి సారిగా డ్రోన్, డిజిటల్ సర్వే ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తుందన్నారు. జగనన్న ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజల కోసం అనేక పథకాలను తీసుకొస్తుందన్నారు. అనంతరం 116 మందికి జగనన్న శాశ్వత భూ హక్కు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫిరోజ్‌ఖాన్, ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్, డీఎల్‌పీఓ నాగరాజ, సర్పంచ్ సుధారాణి, వైస్ ఎంపీపీలు వెంకట్రమణ, కిరణ్ కుమార్, నాయకులు చింతల ఆనంద రెడ్డి, నీళ్ళభాస్కర్, రవీంద్ర రెడ్డి, సత్యా, నరసింహులు, కేశవ రెడ్డి, శ్రీధర్‌రాయల్, లక్ష్మీనారాయణరెడ్డి, ఫారుఖ్, నల్లంకి నరసింహులు, మెంబరు శీనా, రాయుడు, ఆనంద, సురేష్ రెడ్డి, షాహెద్, శివారెడ్డి, నక్కా చంద్రశేఖర్, సెక్రటరీలు రజిత, భయ్యారెడ్డి పాల్గొన్నారు.

జీవామృతం పిచికారీతో మెరుగైన దిగుబడి



జీవామృతంపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

వాల్మీకిపురం: జీవామృతం పిచికారీతో మెరుగైన పంట దిగుబడి సాధ్యమని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు రిసోర్స్ పర్సన్ పెద్ద రెడ్డెయ్య అన్నారు. మంగళవారం మమడలంలోని టి.సాకిరేవుపల్లిలో జీవామృతం తయారీ పద్ధతులపై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఎకరం పొలానికి 200 లీటర్ల జీవామృతం తయారీ అవసరమన్నారు. సాకిరేవుపల్లికు చెందిన రైతు చంటి 2 ఎకరాల వరి పంటకు సంబంధించి 400 లీటర్ల జీవామృతం తయారీని ప్రకృతి సిబ్బంది క్షేత్రస్థాయిలో చేసి రైతులకు చూపించారు. అనంతరం రైతు వ్యవసాయ పొలంలో జీవామృతం పిచికారి విధానాన్ని క్షేత్రస్థాయిలో నిర్వహించారు. అనంతరం పెద్దరెడ్డెయ్య మాట్లాడుతూ ద్రవ జీవామృతం వలన భూమిలో పల ఎక్కువ సంఖ్యలో సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయని, తద్వారా మొక్కకు కావాల్సిన పోషకాలు అందుతాయని వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి సిబ్బంది వినోద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మిట్స్‌ను సందర్శించిన జపాన్ ప్రొఫెసర్లు

కురబలకోట: ఇంజినీరింగ్ అభ్యర్థులకు జపాన్‌లో పుష్కలంగా ఉద్యోగావకాశాలు ఉన్నాయని ఆ దేశ గకుషుయిన్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు యుకారి షిరోటా, టొ ట్సుజీ కుబోయామా, చిబా యూనివర్సిటీ ప్రొఫెసర్ టకాటో హషిమోటో పేర్కొన్నారు. మండలంలోని అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలను మంగళవారం వీరు సందర్శించారు. అధ్యాపకులతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ 2030 నాటికి జపాన్‌లో 60 లక్షలకు పైగా ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయన్నారు. జపనీస్ భాషతో పాటు నైపుణ్యం కీలకమన్నారు.

ఆర్టీసీ స్థలాల్లో మెరుగైన వ్యాపారాలకు అవకాశం

పీలేరు రూరల్: ఏపీఎస్ ఆర్టీసీ స్థలాల్లో మెరుగైన వ్యాపారాలకు అవకాశాలు ఉన్నాయని జిల్లా ప్రజా రవాణాధికారి పి.రాము అన్నారు. మంగళవారం ఆర్టీసీ డిపోలో పారిశ్రామిక, వ్యాపారవేత్తలతో సమావేశం నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండులో ఖాళీ స్థలాలు పీఓటీ 33 సంవత్సరాలకు అద్దెకు ఇవ్వనున్నట్లు తెలిపారు. పీలేరు డిపో చిత్తూరురోడ్డు మార్గంలో 83 సెంట్లు స్థలాన్ని అద్దె ఇవ్వనున్నట్లు తెలిపారు. వ్యాపారస్తులు భవనాలు నిర్మించుకుని వ్యాపారం చేసుకోవచ్చునన్నారు. 33 సంవత్సరాలకు తరువాత ఆర్టీసీకి అప్పగించాలన్నారు. ఈనెల 4 నుంచి సెప్టెంబర్ 8వరకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. సెప్టెంబర్ 20న ఆన్‌లైన్‌లో టెండర్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ డైరెక్టర్ రాజారెడ్డి, డీఎం బిఎం కుమార్,సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంధం మహోత్సవం



మకాన్ వద్ద ఫాతేహాలో పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

పెద్దమండ్యం: మండలంలోని పాపేపల్లెలో హజ్రత్ గూగూడు టోపీవాలే సాహెబ్ వారి ఉరుసు ఉత్సవంలో భాగంగా మంగళవారం జరిగిన గంధం మహోత్సవంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు ఎమ్మెల్యేకి ఘనస్వాగతం పలికారు. మకాన్ వద్ద గూగూడు టోపీవాలే సాహెబ్ పీర్ల వద్ద ఎమ్మెల్యే ఫాతేహా (చదివింపులు) నిర్వహించారు. అనంతరం ఫకీర్లవారి రాతిబ్‌లతో, భాజాబజంత్రీలతో, బాణాసంచా వేడుకలతో గంధము ఊరేగించారు. గుర్రం రమేష్, సర్పంచ్ పీరాన్‌బీ, ఎంపీటీసీ బోడిమాని గీత, వాటర్‌షెడ్ చైర్మన్ గల్లా నరసింహులు, సర్పంచ్‌లు బాషా, విశ్వనాథ, మొలక బయ్యారెడ్డి, విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా మొహర్రం వేడుకలు

గుర్రంకొండ: మండల కేంద్రమైన గుర్రంకొండలో మొహర్రం వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. వారం రోజులుగా గ్రామంలోని పీర్ల చావిడ్లలో పీర్లను నిలిపి ప్రార్థనలు, పూజలు నిర్వహిస్తున్నారు. మంగళవారం స్థానిక కొత్తపేట, తాలీం వీధుల్లోని పీర్ల చావిడిళ్లలో పీర్లను రంగురంగుల అందంగా అలంకరించారు. చాందినీలతో అలంకరించిన ట్రాక్టర్లలో పీర్లను నిలిపి గ్రామపురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, జమీర్, నూర్‌అహ్మద్, జమీలా, బండ రాజు, మౌలా, గయాజ్ పాల్గొన్నారు.

అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వాన్ని ఆదరించండి



పీలేరులో సమస్యలు తెలుసుకుంటున్న జీవీ రాకేష్‌రెడ్డి తదితరులు

పీలేరు : అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని యువపారిశ్రామిక వేత్త జీవి రాకేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం పీలేరు టౌన్ రైల్వే గేటు, సాయిబాబావీధి, తదితర వీధులలో ఇంటింటిని సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి నవరత్నాలలో భాగంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని, అర్హత కలిగి ఉండి ఏదైనా చిన్నచిన్న సమస్యల కారణంగా లబ్ది చేకూరకుంటే వెంటనే తెలియజేయాలని కోరారు. వ్యక్తిగత, గ్రామ సమస్యలు ఉన్నా తెలియజేయాలని, అభివృద్ధిలో అందరం పాలుపంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. బియ్యం కార్డులు, పింఛన్లు, రైతు భరోసా, సచివాలయాలలో సమస్యలు ఉన్నా తెలియజేయాలన్నారు. పీలేరు పట్టణంలో ప్రతి ఇంటికీ మొక్క నాటి పచ్చదనం పెంచడానికి గ్రామస్తులు కూడా శ్రద్ధపెట్టాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఏఎస్ హుమయూన్, నరేష్‌రెడ్డి, ఆనంద, ఉదయ్‌కుమార్, జహంగీర్, క్రిష్టారెడ్డి, చలపతి, అరుణ, సహదేవరెడ్డి, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో ఆలయాలు కిటకిట



పూజలు చేస్తున్న మహిళలు

ములకలచెరువు: శ్రావణ మంగళవారం సందర్భంగా మండలంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక మండల కేంద్రం పీటీయం రోడ్డులోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయం, పెద్దపాళ్యంలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం, రెడ్డివారిపల్లె శ్రీ అవదూత ఆదినారాయణ స్వామి ఆశ్రమంలో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి ఆలయాల్లో స్వామి విగ్రహానికి ప్రత్యేకంగా అలంకరించి వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

క్షయరోగులకు పౌష్టికాహారం పంపిణీ



జిల్లా ఆస్పత్రిలో క్షయరోగులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న వైద్యులు

మదనపల్లె: క్షయరోగులకు జాతీయ వ్యాధి నిర్మూలన, ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో మెడికల్ సూపరింటెండెంట్ పద్మాంజలిదేవి, ఆర్‌ఎంఓ ప్రసాదరాజు, పాల్ రవికుమార్‌లు పౌష్టికాహారం పంపిణీ చేశారు. మెడికల్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ క్షయవ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. దాతల సహాయంతో రోగులకు ఆరు నెలల పాటు పౌష్టికాహార కిట్లను అందజేస్తున్నట్లు తెలిపారు. క్షయవ్యాధి నివారణలో మందుల వాడకంతోపాటు పౌష్టికాహారం తీసుకోవడం కీలకమన్నారు. అనంతరం స్థానిక క్షయవిభాగం అధికారి ప్రభాకర్ కుమారుడు పునీత్‌సాయి జన్మదినం సందర్భంగా ఉచిత భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీబీ విభాగం సిబ్బంది దయాళన్, ప్రభాకర్, సుశీల, వనజకుమారి, తరుణ్, సునిత, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రీరామరక్ష

వాల్మీకిపురం: ప్రతితల్లి బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలను పట్టించాలని స్థానిక సీడీపీవో భారతి అన్నారు. మంగళవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ ప్రాంతంలో తల్లిపాలపై అవగాహన సదస్సుతో పాటు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సదస్సును ఉద్దేశించి సీడీపీవో మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలను పట్టించాలని, బిడ్డకు ఆరు నెలల వయస్సు వచ్చే వరకు తల్లిపాలనే పట్టించాలని సూచించారు. ఆరు మాసాలు పూర్తి అయిన తరువాత అనుబంధ ఆహారం బిడ్డకు మొదలు పెట్టాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది శారద, మానస పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

మదనపల్లె: విజయవాడలో న్యాయవాది ఆర్.ఆదిశేషు విఠల్‌బాబు హత్యను నిరసిస్తూ స్థానిక కోర్టు ఆవరణంలో మదనపల్లె బార్ అసోసియేషన్, ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ సభ్యులు ఉమ్మడిగా నిరసన కార్యక్రమం చేపట్టారు. నిందితులకు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు. న్యాయవాది హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల రక్షణకు చట్టం తీసుకురావాలని కోరారు. న్యాయవాదులపై దాడిని న్యాయవ్యవస్థపై దాడిగా అభివర్ణించారు. ఎ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అ. ధ్యక్షులు జనార్ధన్‌రెడ్డి, కార్యదర్శి మనోహర్, జాయింట్ కార్యదర్శి సోమశేఖర్, న్యాయవాదులు ఆనందరెడ్డి, గోపాలకృష్ణ, రామగోపాల్‌రావు, శేఖర్‌నాయుడు, వెంకటరమణారెడ్డి, గోపాల్‌రెడ్డి, పీ.వి.ప్రసాద్, మెహన్‌కుమార్, కృష్ణారెడ్డి,వెంకటరమణ, బయ్యారెడ్డి, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సేవలను అప్‌లోడ్ చేయాలి

కేవీపల్లి: ఆశా కార్యకర్తలు ఆరోగ్య సేవలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని డీపీఎంఓ డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. ఆశా దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని గర్నిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు ప్రభుత్వం ట్యాబ్‌లు మంజూరు చేసిందని, వాటితో తమ పరిధిలోని వెయ్యిమంది జనాభాను మ్యాప్ చేసుకుని వారికి అందే సేవలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. దీనిపై ఇప్పటికే శిక్షణ ఇచ్చామన్నారు. ఎప్పటికప్పుడు యాప్‌ను అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో 67 రకాల మందులు, 14 రకాల వైద్య పరీక్షలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ భాగ్యలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ గిరిధర్ రెడ్డి, హెచ్‌ఈ మహమ్మద్ రఫీ, సూపర్వైజర్‌లు క్రిష్ణమ్మ, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్ మీట్‌కు ఏర్పాట్లు

మదనపల్లె సిటీ: రీజనల్ లెవెల్ అథ్లెటిక్ మీట్–2023 అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక చిత్తూరురోడ్డులోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఈనెల 3 నుంచి నుంచి 5వరకు రీజనల్ లెవెల్ అథ్లెటిక్స్ మీట్ నిర్వహించనున్నారు.

పారదర్శకంగా ఇంటింటా ఓటరు సర్వే



మాట్లాడుతూ ఆర్డీఓ మురళి

మదనపల్లె : నెల రోజులపాటు నిర్వహించనున్న ఇంటింటి ఓటరు సర్వేని ఎన్నికల సిబ్బంది పారదర్శకంగా నిర్వహించాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి అన్నారు. మంగళవారం స్థానిక సబ్‌కలెక్టరేట్ సమావేశ భవనంలో తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సిబ్బంది తప్పనిసరిగా తమకు కేటాయించిన పోలింగ్ స్టేషన్లను పరిశీలించి, అసవరమైతే లోకేషన్ మారకుండా పక్కనున్న భవనాలను పోలింగ్ స్టేషన్లుగా ప్రతిపాదించాలని సూచించారు. సర్వేలో భాగంగా బిఎల్‌ఓలు కచ్చితంగా ప్రతి ఇంటికీ వెళ్లి ఆ కుటుంబంలో ఉన్న ఓటర్ల వివరాలను పక్కాగా నమోదు చేయాలని అన్నారు. ఓటరు సర్వేలో తప్పులు చేస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. సర్వే ప్రక్రియలో ఎట్టి పరిస్థితిలోనూ వలంటీర్లను ఉపయోగించ వద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు మంజుల, మహబూబ్ చాంద్, ఎన్నికల డిటి పద్మనాభం, బిఎల్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పీలేరు రూరల్: 2023–24 సంవత్సరానికి సంబంధించిన ఓటరు జాబితా కోసం ఇంటింటా సర్వే పారదర్శకంగా నిర్వహించాలని ఎన్నికల అధికారి, హంద్రీనీవా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎ.గోపాలకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలకు, బూత్‌లెవల్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చనిపోయిన వారు,పెళ్లి అయి వెళ్లిపోయిన వారు, ఊరు వదిలినవారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించాలన్నారు. డబుల్ ఎంట్రీ కూడా తొలగించాలన్నారు. 1.1.2024 సంవత్సరానికి గాను 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలన్నారు. ఇంటింటా సర్వే పూర్తి చేసి స్వచ్చీకరణ ఓటరు జాబితాను తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో తాహసీల్దార్ ధనుంజయులు, డీటీలు సుబ్రమణ్యం, నారాయణరెడ్డి, ఏఎస్ఓ రామమోహన్, హేమ, యతిరాజులు తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె: తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించాలి. బీఎల్‌వోలు చేపట్టిన ఇంటింటా ఓటర్ల వెరిఫికేషన్ కార్యక్రమాన్ని సకాలంలో పూర్తి చేయాలని ఎన్నికల నిర్వహణ అధికారి సందీప్ తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో తంబళ్లపల్లె, పెద్దమండ్యం మండలాల బీఎల్‌వోలతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకు బీఎల్‌వోలు నిర్వహించినటువంటి నివేదికలను పరిశీలించారు.

రెవెన్యూ సేవలు సత్వరం అందించాలి

వాల్మీకిపురం: ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి రెవెన్యూ సేవలను ప్రజలకు అందించాలని మదనపల్లి ఆర్డీవో మురళి అన్నారు. సోమవారం మండలంలోని ఓబులంపల్లి సమీపంలో పెట్రోల్ బంక్ కోసం సేకరించిన వ్యవసాయ భూమికి సంబంధించి కన్వర్షన్ చేసేందుకు సంబంధిత భూములను ఆర్డీవో మురళి రెవెన్యూ అధికారులతో కలసి పరిశీలించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ప్రజలకు అందించే రెవెన్యూ సేవల్లో జాప్యం చేయొద్దని, నిర్దేశించిన సమయానికి ప్రజలకు, రైతులకు సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫిరోజ్ ఖాన్, సర్వేయర్ శ్రీనివాసులు, ఆర్ఐ బాబ్జి, వీఆర్‌వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవు

– రాయచోటి ఆర్డీఓ రంగస్వామి

పీలేరు : నిత్యవసర వస్తువుల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే ఎంతటివారైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మంగళవారం పీలేరు టౌన్ తిరుపతి రోడ్డు లోని సివిల్‌సప్లై గోడౌన్ పాయింట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోడౌన్‌లో 1606 బస్తాలు బియ్యం, 117 బస్తాల చక్కర, 156 బాక్స్‌లు పామోలిన్ ఆయిల్ మాత్రం స్టాక్ ఉండటం చూసి నేటి వరకూ గోడౌన్‌పాయింట్‌కు వచ్చిన మొత్తం నిత్యావసరాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అన్ని కార్డులకు సరిపడు బియ్యం, చక్కర, రాగులు మరియు పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు సకాలంలో నిత్యవసర సరుకులు అందజేయాలని డీటీ సుబ్రమణ్యంను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ధనుంజయులు, డిటి నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.